## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రసమయి



జనత న్యూస్ బెజ్జంకి : మానకొండూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ మండల బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి శనివారం మండలంలోని గుగ్గిళ్ళ గ్రామంలో ఇటీవల మృతి చెందిన జేరిపోతుల కిష్టయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, అనంతరం అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విశ్వవోజు నాగభూషణము ను, అలాగే తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన దానవేణి మల్లయ్య అనారోగ్యంతో చికిత్స పొందగా , వారిని కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, చింతకింది శ్రీనివాస్ గుప్తా, కొమిరె మల్లేశం, టేకు తిరుపతి, ముక్కిస తిరుపతి రెడ్డి, ముక్కిస రాజిరెడ్డి, ఎలా శేఖర్ బాబు, బిగుళ్ల దుర్గ సుదర్శన్, బిగుళ్ల మోహన్, మేకల యాదగిరి, కొంకటి సురేష్, దానబోయిన పోచయ్య, కొంకటి ఆగయ్య, చెప్యాల సంతోష్ గౌడ్, గుగ్గిళ్ళ శంకర్ బాబు, గుగ్గిల రాజేష్, మేకల శ్రీధర్, నారాయణ, స్వామి, మల్లేశం తదితల్లి పాల్గొన్నారు.

## దాచారంలో ఉచిత వైద్య శిబిరం




జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని దాచారం గ్రామంలో శనివారం కరీంనగర్ కు చెందిన ప్రైవేట్ హాస్పిటల్ మెడి కవర్ వారు, దాచారం గ్రామ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడం కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, 125 మంది గ్రామస్తులకు ఉచిత బిపి,షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి రోగనిర్ధారణ చేసినట్లు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ, తమ ఆస్పటల్ లో 24 గంటలు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సురేష్, కారోబార్ రాజు, గ్రామస్తులు బైరా సంతోష్, బండిపెల్లి సత్యనారాయణ, హాస్పటల్ సిబ్బంది కోట కరుణాకర్, శ్రీకాంత్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించండి

**ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతర వేణి మహేష్.**





జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో అస్తవ్యస్తంగా ఉన్నటువంటి డ్రైనేజ్ వ్యవస్థను పట్టించుకున్న అధికార యంత్రాంగం లేదని, గ్రామపంచాయతీ కార్యదర్శి కి పలుమార్లు కాలనీవాసులు మొరపెట్టుకున్న పట్టించుకుంటలేరని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ , సంబంధిత అధికారులకు సమస్య పరిష్కారం కోసం పత్రిక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో డ్రైనేజీ కాలువలో మట్టి పోయడం ద్వారా మురికినీరు ఇళ్లలోకి వస్తున్నాయని , తద్వారా ప్రజలు వర్షాకాలంలో అనేక రోగాల బారిన పడుతున్నారని,ఈ డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని మండల, జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రొడ్డ చరణ్, సంగెం సతీష్, అంతటి రాకేష్, నరేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ నియోజకవర్గంలో.. రక్తికడుతున్న బీజేపీ రాజకీయం!

### బండి - ఈటల వర్గాల ఆధిపత్య పోరు?

### అధిష్ఠానానికి చేరనున్న పంచాయతీ..



(కోరెం సుధాకర్ రెడ్డి, జనతా న్యూస్, హుజురాబాద్)

మరోసారి హుజురాబాద్ రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారింది. హుజురాబాద్ బీజేపీలో గ్రూపుల పోరు తారాస్థాయికి చేరింది. కేంద్ర హెూం శాఖా సహాయమంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వర్గాల మధ్య పోరు ఉధృతమవుతున్నట్లు తెలుస్తోంది.

**నేపథ్యం ఇదీ.. !**

ఈటల రాజేందర్ 2020 లో బి ఆర్ ఎస్ కు రాజీనామా చేసి బిజెపి లో చేరి హుజురాబాద్ ఉప ఎన్నికలో గెలుపొందారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఈటల హుజురాబాద్ అసెంబ్లీ స్థానంలో ఓటమి చెందారు. ఐతే 2023 సాధారణ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో బండి సంజయ్ గెలుపొందగా.. ఈటల మల్కాజిగిరి స్థానం నుండి గెలుపొందారు. కాగా ఈటల మల్కాజిగిరి ఎంపీగా గెలుపొందిన తర్వాత అయన ఇక్కడకు రావడం తక్కువైంది. ఐతే హుజురాబాద్ లో ఈటలకు బలమైన వర్గం ఉంది.

**ఏం జరిగింది?**

ప్రస్తుతం బీజేపీ పార్టీ యంత్రాంగం అంతా కేంద్ర మంత్రి బండి సంజయ్ కనుసన్నల్లో నడుస్తున్నట్లు , పార్టీ వ్యవహారాల్లో ఈటల వర్గానికి తగినంత ప్రాతినిధ్యం లభించడం లేదని ఆ వర్గం వాపోతోంది.నిజానికి ఈటల మొదట కేంద్ర మంత్రి పదవి ఆశించారు. కానీ రాలేదు. చివరకు ఈటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి లభిస్తుందని అయన వర్గం భావించింది. కానీ చివరి క్షణంలో స్థానిక నేత వల్లే.. ఈటలకు అధ్యక్ష పదవి రాలేదనే ఈటల వర్గం భావించింది.

**కమలంలో చిచ్చురేపిన సైకిళ్ళ పంపిణీ**

ఇటీవల హుజురాబాద్ లో బండి సంజయ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్ళ పంపిణీ కార్యక్రమం నిర్వహించగా ఈటల వర్గానికి ఎలాంటి ఆహ్వానం, సమాచారం లేదు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో కూడా ఈటల ఫోటోలు లేవు. దీనిపై ఈటల వర్గం ఆగ్రహంగా ఉంది. ఐతే.. హుజురాబాద్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి మాట్లాడుతూ.. బీజేపీలో వర్గాలు, గ్రూపులు లేవని, అందరు పార్టీకోసం పనిచేయాల్సిందేనని, ఎవరైనా గ్రూపులు కడితే.. కఠిన చర్యలు తీసుకుంటామని, వారికీ స్థానిక ఎన్నికల్లో టికెట్లు ఇవ్వమని స్పష్టం చేసారు. కాగా నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గా ఉన్న ఈటల అనుచరుడైన మాడ గౌతమ్ రెడ్డి తనకు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ బీజేపీ కి రాజీనామా చేయడం సంచలనం రేపింది.

**శామీర్పేట్ కు ఈటల శ్రేణులు !!**

హుజురాబాద్ నియోజకవర్గ బీజేపీలో బండి, ఈటల వర్గాల ఆధిపత్య పోర్టు తారా స్థాయికి చేరుతోంది. తాజాగా శనివారం ఈటల రాజేందర్ వర్గానికి చెందిన వారు తాడోపేడో తేల్చుకునేందుకు హైదరాబాద్ శామీర్పేట్ లోని ఈటల నివాసానికి వెళ్లారు. బీజేపీలో తమకు సరైన గుర్తింపు లభించడం లేదని, బండి సంజయ్ వర్గం తమను అవమానాలకు గురి చేస్తోందంటూ.. వారు ఈటల సమక్షంలో తమ ఆవేదనను వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. తమకు బండి వర్గం టికెట్లు ఇస్తుందా? లేదా? అనే అనుమానాలు కూడా ఈటల వర్గంలో ఉన్నాయి. ఈ సందర్భంగా ఈటల కూడా ఆవేశంగా మాట్లాడారు. కొంతమంది శామీర్పేట గ్రూపు అంటూ ప్రచారం చేస్తున్నారని, తాను రెండుసార్లు మంత్రిగా రెండుసార్లు బి ఆర్ ఎస్ లో జిల్లా అధ్యక్షునిగా పనిచేశానని, కరీంనగర్ లో తాను అడుగుపెట్టని గ్రామం అంటూ లేదని ఆవేశంగా అన్నారు. తనపై విమర్శలు చేస్తున్నారంటూ... పరోక్షంగా బండి సంజయ్ వర్గంపై మండిపడ్డారు. కాగా బిజెపి జిల్లా అధ్యక్షునిగా ఉన్న గంగాడి కృష్ణారెడ్డి కూడా హుజురాబాద్ నియోజకవర్గం వీణవంక మండలానికి చెందినవాడు కావడం గమనార్హం. ఈ గ్రూపులపోరు అయన సొంత మండలంలో కూడా ఉండడం విశేషం. ఇదిలాఉంటే.. తాను ఈ విషయాన్ని అధిష్టానం వద్దే తేల్చుకుంటానంటూ.. ఈటల శామీర్పేట లోని తన నివాసం వద్ద ప్రకటించారు.

**ఏం జరుగుతుందో?**

హుజురాబాద్ బీజేపీలో జరుగుతున్న పరిణామాలపై ఈటల రాజేందర్ తో పాటు అయన వర్గం సీరియస్ గా ఉన్నారు. ఈ విషయాలను అయన అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉంది. బండి వర్గం తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్న అంశాన్ని కేంద్ర స్థాయిలో అమిత్ షా దృష్టికి తీసుకువెళ్లారా? లేక.. రాష్ట్ర స్థాయిలో కిషన్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు దృష్టికి తీసుకువెళ్తారా? ఈ వ్యవహారంలో బండి వర్గం ఏమైనా తగ్గుతుందా? లేక సై అంటే.. సై అని అంటుందా? అధిష్ఠానం ఈ అంశంలో ఏవిధంగా వ్యవహరిస్తుంది? అన్నది స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఏసిపి మహేష్‌కు.. కన్నీటి వీడ్కోలు

**కంట తడి పెట్టిన ఖాకీలు**

**ఎసిపి మాధవిని పరామర్శించి ఓదార్చిన పోలీసు సిబ్బంది**

**కరీంనగర్ లో ముగిసిన అంత్యక్రియలు**



హుజురాబాద్, జులై 19 జనతా న్యూస్: గుండెపోటులో కన్నుమూసిన కరీంనగర్ పోలీసు ట్రైనింగ్ సెంటర్ ఏ సి పి, హుజురాబాద్ ఏ సి పి మాధవి భర్త మహేష్ అంత్యక్రియలు ఖాకీలు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య శనివారం జరిగాయి. విషణ్ణ వదనంతో అయన కుమారుడు తన తండ్రి చితికి నిప్పంటించడం పలువురినిని కదిలించివేసింది. మహేష్ మృత దేహాన్ని చూసి పలువురు కంట తడిపెట్టారు. మహేష్ సతీమణి, హుజురాబాద్ ఎసిపి మాధవిని పలువురు పరామర్శించి ఓదార్చారు. పూర్వ కరీంనగర్ జిల్లాతో పాటు, పలు జిల్లాల నుండి పోలీసు ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది మహేష్ పార్థివ దేహాన్ని కడసారి చూసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలువురు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులు, బంధువులు గుండెలవిసేలా రోదిస్తున్న తీరు పలువురిని కదిలించివేసింది. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం చేసారు.

**పలువురి సంతాపం**

ఎసిపి మాధవి భర్త, ఎసిపి మహేష్ మృతి పట్ల మాజీ ఎంపీ కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్, కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్, వివిధ పార్టీల నేతలు బండ శ్రీనివాస్, పూసల ప్రభావతి రెడ్డి, వర్దినేని రవీందర్రావు, గందె శ్రీనివాస్, వడ్లూరి విజయ్ కుమార్, కౌరు సుగుణాకర్ రెడ్డి, కొలిపాక శ్రీనివాస్, గుడిపాటి జయపాల్ రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

**హుజూరాబాద్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సునీత**

**హుజూరాబాద్లో.. ఆయిల్ పామ్ తోటలను సందర్శించిన ఏడిఏ సునీత.**



హుజురాబాద్ జులై 19 జనతా న్యూస్: మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ ఆయిల్ పామ్ ఉత్పత్తి లేక విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని.. ఉత్పత్తి పెంచితే రైతులకు ఆదాయం పెరగడం తో పాటు దేశం ఆర్థికం గా ముందుకు వెళ్తుందని హుజురాబాద్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఏడీఏ సునీత అన్నారు. శనివారం ఆమె స్థానిక వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్ పామ్ పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తుందన్నారు.

పంటకు మద్దతుగా ప్రభుత్వ సహాయం అందజేస్తుందని,

నర్సరీల్లో ఒక్కో ఆయిల్ పామ్ మొక్క ధర రూ.193 ఉండగా, కేవలం రూ.20 లకు మాత్రమే రైతులకు అందిస్తున్నామని తెలిపారు. మిగతా రూ.173 సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. పంట నిర్వహణ ఖర్చుల కోసం ఎకరాకు రూ.4200 చొప్పున నాలుగేళ్ల పాటు ప్రోత్సాహకంగా ప్రభుత్వం అందిస్తుందని, నేరుగా ఆయిల్ పామ్ కంపెనీ నే పంటను కొనుగోలు చేసి రైతు ఖాతాల్లో 15 రోజుల్లో డబ్బులు జమ చేస్తుందని వివరించారు. ప్రతి నెలా పారదర్శకంగా ధరను ప్రభుత్వమే నిర్ణయించడం జరుగుతోందని, మొదటి మూడు సంవత్సరాల్లో అంతర పంటలను సాగు చేయవచ్చని, ఇది రైతులకు అదనపు ఆదాయం ఇస్తుందని ఏ డి ఏ సునీత తెలిపారు. ప్రతి క్లస్టర్‌కు క్లస్టర్ అధికారుల ద్వారా సాంకేతిక మార్గదర్శనం నిరంతరం వ్యవసాయ శాఖ అందిస్తుందన్నారు. డ్రిప్ ఇరిగేషన్ కోసం ప్రత్యేక సబ్సిడీ అందుబాటులో ఉందని, దళిత గిరిజన రైతులకు 100%, వెనుకబడిన తరగతుల చిన్న, సన్నకారు రైతులకు 90%, ఇతరులకు 80% సబ్సిడీ పై 12.5 ఎకరాల వరకు అందించబడుతుందన్నారు. ఇతర పంటలతో పోల్చితే, ఆయిల్‌పామ్‌లో తెగుళ్లు, చీడ పీడా ల బెడద తక్కువగా కనిపిస్తాయని, తక్కువ శ్రమతో ఎక్కువ లాభం తీసుకువచ్చే దీర్ఘకాలిక పెట్టుబడి పంట అని అన్నారు. మూడేళ్లు పూర్తి అయిన తర్వాత నాలుగో ఏడాది 3 నుండి 4 టన్నుల దిగుబడి మొదలవుతుందని,

ఐదవ ఏడాది (5 నుండి 6 టన్నులు, ఆరవ ఏడాది 10 నుండి12 టన్నులు దిగుబడి వస్తుందన్నారు. సుమారు 30 నుండి 35 ఏండ్ల పాటు కొనసాగుతుందని, టన్ను ఆయిల్ పామ్ ధర రూ. 15 వేలు గా తీసుకుంటే, ఖర్చులు పోను రైతుకు ఒక ఎకరాకు రూ.1,00,000 వరకు లాభం వస్తుందన్నారు. ఆరవ ఏడాది నుండి కోకో, వక్క, జాజికాయ, పొద మిరియాలు లాంటి అంతర పంటలను వేసుకోవచ్చని, తద్వారా అదనపు ఆదాయం ఎకరాకు రూ. 4 లక్షలు వస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ పంట సాగుపై ఆసక్తిగల రైతులు వ్యవసాయ విస్తరణ అధికారిని సంపాదించాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో ఏ.ఓ. భూమి రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ బి. మంజువాణి,, ఏ.ఇ.ఓ. నిఖిల్ , ఫీల్డ్ ఆఫీసర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

